

# ముందున్న ఇందుబింబం

'మంజుశ్రీ'

"మీకేంరా, మీతరంవాళ్లు చాలా అదృష్టవంతులు" అంటున్నాడు తాతయ్య రెండు మూడు రోజుల నుంచీ మనసులో ఏమిటో చాలా దూరాలోచన చేస్తేగాని ఆయనట్లా మాట్లాడడని సూర్యానికి తెలుసు కాని ఆయనతో వివరంగా మాట్లాడటానికి అతనికి మనస్కరించటంలేదు ఎన్ని మాటలు చెప్పినా, ఎన్ని ఊహాలుచేసినా, కొత్త తరానికీ పాతతరానికీ. ఎడమూ, సంఘర్షణా, ఎప్పుడూ వుంటూనే వుంటాయి. వాద వివాదాలవల్ల తేలే సంగతికాదు ఇది. పాత తరంవాళ్లు ఎంత ముందుకొస్తున్నామని చెప్పినా, కొత్త తరంవాళ్లు నిబ్బరించుకుని, నిలదొక్కుకున్నా, మార్పు కొత్తతరంలో కొట్టవచ్చినట్లు కనపడవలసిందే

పాతతరంలో కొత్తను గౌరవించే కుటుంబం తమది. ఆతరంవాళ్ళలో ఆడపిల్లలు చదువుకోవటం, వయస్సు బాగా వచ్చినతరువాత పెళ్ళిళ్లు మొదలైన అన్ని విషయాల్లోనూ, ఇతరులకన్నా ముందుగా వున్నారు


కాని ఇప్పుడు తాను శకుంతలను చేసు

కుంటానంటే, ఎవరికీ సమ్మతంగాలేదు ఇంట్లో ఎందుకనో!

తాతయ్య, తనతరం రోజుల్లో యుధా శక్తి సంఘ సంస్కర్తలను పొగడటమూ, వాళ్ళ ఆశయాలను ప్రచారం చెయ్యటమూ చేస్తూనే వుండేవాడు అయితే ఆయనది భోగప్రవృత్తి కావటంవలన, తక్కిన విషయాలను ఎక్కువగా పట్టించుకోలేదు. వందఎకరాలు, తాత తండ్రులు ఇచ్చి పోతే సుర్రప్పందాలకు, పేకాటలకు, పాతికమున్నైప్పై ఎకరాలు పోగొట్టాడు బ్రాహ్మ సమాజంపేరున పాడుపనులు చేయటానికీ, లలితకళలనూ, నాటక రంగాన్నీ వుద్ధరించేపేరున, చెడు తిరుగుళ్ళు తిరగటానికీ ఆయన వెను కడుగు వేయలేదట ఇప్పుడాతనువు బాగా సడలిపోయింది. మరింకా మనసులో ఏమాలోచనలున్నాయో.

ఎప్పుడైతే శకుంతలను తాను చేసుకో వటం ఇష్టంలేదని ఇంట్లోవాళ్ళంతా, ఆడామగా, అక్కలూ చెల్లెళ్ళూ అన్నలూ వదినలూ అమ్మా నాన్నా, స్పష్టంగాచెప్పాలో, పోనీ తాతయ్య మూడు తరాలను చూసినవాడు, ఏడుపదుల వయస్సు వెళ్ళినవాడూ, తన కళ్ళముందే ఎన్నెన్నో మార్పులు, నమ్మలేనిసంగ తులు నిజాలుకావటం చూసినవాడుకదా, అని ఆయనతో ప్రస్తావిస్తే, అయన బాగా పండిపోయిన అనుభవంగల నక్కలానవ్వి, 'నాయనా జీవితంలో సుఖపడదలుచుకుంటే తల్లిదండ్రులు చెప్పినట్లు వినటంకన్నా రాజమార్గం లేదు వయసులోని రక్తపు పొంగువలన ఏవిచేవిటో ఘనకార్యాలు గూర్చి ఆలో చిస్తారుగాని, జీవితంలో సుఖపడటం కన్నా లక్ష్యం ఇంకొకటిలేదు అని తెలుసుకుంటే, అనిభోగనే ప్రవర్తిం చాలి ఎప్పుడూ' అని ఉపన్యాసం మొదలుపెట్టాడు తనకు చాలా అసహ్యం వేసింది అప్పటినుండే ఎవరితోటీకూడా మనస్ఫూర్తిగా మాట్లాడటంలేదు సూర్యం తారతమ్యాలుండవచ్చును గాని, యీ మనుషులందరూ దొంగలే స్వార్ధ పరులే అనిపించింది సూర్యానికి

'ఇవాళ ఆదివారం శకుంతలని శిల్పకళ ఎగ్జిబిషన్‌కు తీసికెళ్లాలి' అని నిద్రలేస్తూనే సూర్యం జ్ఞాపకం చేసు కున్నాడు ఉదయకాలపు ఎండ మనో హరంగా వుంది ఆవరణలో గులాబి పూలు పూసివున్నాయి శకుంతల తమ ఇంటికి వచ్చినప్పుడల్లా ఓ పువ్వుకోసి ఇచ్చేవాడు ఆమె అందంగా అందు కునేది చాలా సంతోషం ప్రకటించేది ఆ సంతోషంలో జాలికూడా తొంగికిచ లాడేది ఇంట్లోవాళ్ళందరికీ, తాను శకుంతలతో స్నేహం చేయటమూ, చనువుగా ఉండటమూ ఇష్టమే పెళ్ళి చేసుకోవటం ఇష్టంలేదు ఇది ఎంత అన్యాయం. వరండాలో ఎండపొడ పడేచోట నిల్చుని కాఫీత్రాగుతున్నాడు




సూర్యం. తాతయ్యా సిగరెట్ వెలిగించుకుని అతేవచ్చుకు మళ్ళీ పాతపాటే అందుకున్నాడు "సూరీ మీ తరంవాళ్ళు చాలా అదృష్టవంతులోయ్ మా రోజుల్లో ఇంతింత పెద్ద ఉద్యోగాలూ, ఇన్ని ఉద్యోగావకాశాలూ, ఇంతింత పెద్ద జీతాలూ, ఇన్ని కార్లూ, ఇంతడబ్బూ వుండేవికాదోయ్. అవన్నీ అలా వుంచు. ఇన్నిన్ని చదువులూ వుండేవికావుగా!"

సూర్యానికి ముసలాయనపట్ల ఏమీ ప్రసన్నంగాలేదు మనసు.

"మీ రోజుల్లో సంఘ సంస్కారమూ, బోగంవాళ్ళూ, స్వతంత్రోద్యమం వుండేవిగా" అన్నాడు సూర్యం వెటకారంగా.

"నిజమే నసుకో అవన్నీ లాభపడినవాళ్ళకే లాభించాయి. అందరూ, ఎక్కడ బాగుపడ్డారు ఇంకా చాలా మంది చెడిపోయారనే చెప్పాలి ఆస్తులు పోగొట్టుకున్నవాళ్ళూ, జైళ్ళకిపోయి ఆరోగ్యాలు పాడుచేసుకున్నవాళ్ళూ, లెక్కలేనంతమంది"

సూర్యానికి కోపంవచ్చింది బాగుపడటమంటే, ఇతరులను చెడగొట్టి సంపాదించటమే అని, తాతయ్యా అర్థం కంట్రాక్టులు సంపాదించటం, మంత్రుల చుట్టూ తిరగటం, దేశాన్ని ప్రజలనూ దోచుకోవటం, ప్రయోజకత్వమూ, తెలివితేటలూ, తాతయ్యా దృష్టిలో.

"మీకేంరా ! ఇంకా పదేళ్ళలో విహా


రాలు చెయ్యటానికి మీరు చంద్రమండలానికికూడా వెళ్ళవచ్చును నాయనా మా తరంవాళ్ళ కా అదృష్టం లేదు గదా —"

ఇప్పు డర్థమైంది సూర్యానికి, తాతయ్య తాపత్రయం తా నిప్పుడు కాస్త చిన్నవాడై వుంటే, చంద్రమండలానికికూడా వెళ్ళి, అక్కడేవో నిర్వాకాలు చెయ్యాలనిపిస్తున్నది

"ఇప్పుడు నువ్వు శరభరాజుగారమ్మాయిని చేసుకుంటావనుకో ఆ అమ్మాయిని తీసుకుని, చంద్రమండలానికే హనీమూన్‌కి వెళ్ళవచ్చును లక్షరూపాయలు ఖర్చయినా, ఆయన భరించగల సమర్థుడు ఆయనకు ఒక్కత్తే అమ్మాయి నిన్నుచూసి చాలా మోజుపడుతున్నాడు పైగా నువు డాక్టర్‌కోర్సు చదువుతున్నావంటే ఆయన పళ్ళు పరీ పులిసిపోయాయి నాయనా దేనికైనా డబ్బేకదా మూలం శ్రీమంతుడు సాధుధూపజిత కంతుడు అని భారతంలోకూడా చెప్పివున్నారు" వి పురాణప్రవచనం ఫక్కీలో మొదలెట్టాడు తాతయ్య.

" 'హారిపిక్‌గా' ఎక్కడనుండి ఎక్కడకు దెబ్బావు" అనుకున్నాడు సూర్యం

"ఏమంటావు. చంద్రమండలం చుట్టూ విశ్వాంతరాళంలో, ప్రదక్షిణలు చుట్టి, నిర్భయంగా భూమిమీదికి దిగారు, అని తెలిసినప్పటినుంచీ నా మనస్సు ఎంత కొట్టుకలాడిపోతున్నది. అక్కడే ఏమైనా మాంచి ఉద్యోగమే వస్తుందనుకో, ఈ తనువుతోటే వొక్కసారి నాకూడా, ఆ భాగ్యం కలిగించరా, సూరీ. మళ్ళీ యీ భూమ్మీదకు రాకపోయినా ఫరవాలేదు ఇంతదూరం వచ్చినవాళ్ళు వూరుకుంటారనుకున్నావా? వేలమైళ్ళవేగంతో ప్రయాణాలు సాధించగలిగినవాళ్ళు, లక్షలమైళ్ళు ప్రయాణం చేసేవాళ్ళు చంద్రమండలంపైని ప్రాణవాయువు లేకపోతేమాత్రం సృష్టించకుండా వుంటారా? చల్లని చెట్లూ, చక్కని నీడలూ, అందమైన భవనాలూ, ఆకర్షణీయమైన క్లబ్బులూ రాకుండా వుంటాయా. నీకు ఏమనిపిస్తుందో సూర్యం నేనిట్లా అంటున్నానని పూర్వం మనవాళ్ళంతా, పుణ్యం చేసినవాళ్ళు చంద్రలోకానికి పోతారని అనుకునేవాళ్ళు. అక్కడ మనుషులో, దేవతలో, ఎవరో వుండకపోతే వీళ్ళు పోయి ఏం ఏడుస్తారోయ్. కినర అక్కడ యీవరికే గంధర్వులో, యక్షులో వుండే వుంటారు వాళ్ళెట్లా వుంటారో చూడాలని వుందిరా అబ్బీ ఇంకో పది లేక పది హేను, పోనీఅయ్యా పాతికేళ్ళకు, అమెరికా పోయిరావటం ఇప్పుడెంత మామూలైపోయిందో, చంద్రమండలం వెళ్ళిరావటంకూడా, అంత సులభం కాదట్రా విమానాలు తిరుగుతున్నట్లు




తిరగవురా ఇకముందు రాకెట్లు ఏమో నాయనా, ఈ జన్మకు నాకా యోగముందో లేదో!" అంటూ నిట్టూర్చాడు తాతయ్య.

"ఇంతకూ శరభరాజుగారి కూతురిని చేసుకుంటే చంద్రమండలానికి పంపిస్తా దంటావు?" అన్నాడు సూర్యం ఆసక్తిని నటిస్తూ.

"మా నాయనే బుద్ధిమంతులెప్పుడూ పెద్దవాళ్ళ మాటల్లోని సబబు గ్రహించకుండా వుండరు. ఏ ఎనభై రెండువేల ఏడు వందల ఏభై రూపాయలో టికెట్టు వుంటుందిగదా. యీ మధ్యే ఫారెన్ ఎక్స్ఛేంజిగొడవలో ఏవో వచ్చాయిగదా, నాయనా, శరభరాజుగారి లాంటివాళ్ళు అండలేకుంటే యీ ఆంధ్రదేశంనుండి చంద్రమండలానికి ఎవరు వెళ్ళగలరోయ్"

"నిజమే తాతయ్యా!" అన్నాడు సూర్యం వెటకారంగా

తాతయ్య పొంగిపోయాడు.

సూర్యం లోలోపల ఉడికిపోయాడు

డ్రీమ్‌లాండ్ దగ్గర శకుంతల రెడీగా వుంది. సినిమాకూడా చంద్రమండలానికి సంబంధించిందే 'ఎరౌండ్ ది మూన్' అని సినిమా చూస్తున్నప్పుడు కూడా. తాతయ్య గుర్తుకురావడం, సూర్యానికి చాలా బాధనిపించింది. శరభరాజుగారు చంద్రమండలంలో పెద్ద ఫాక్టరీ కట్టిస్తున్నట్లూ, వాళ్ళమ్మాయి రాణీ దాల్ సరస్సునుంచిన మూన్ సరస్సులో, బోట్ షికార్లు కొడుతున్నట్లూ, ఆలోచనలు వచ్చాయి. ఆ ఆలోచనల నీడలను చూసి బెదురుకున్నాడు. బాక్స్‌లో తన నంటిపెట్టుకునే కూచున్న శకుంతల

చెక్కిలిపైన అరచేయి ఆనించి కూర్చుంటేగాని, ఆ భయంపోలేదు.

శకుంతలకూడా అతడి అనవసరమైన ఉద్వేగాన్ని గమనించి అభ్యంతరం చెప్ప లేదు. నక్షత్రపథంలో చిన్నచిన్న బంతుల్లాగా అవుపిస్తున్న వివిధగోళాలు, నీలాకాశంపరిధిని దాటి పైపైకి చొచ్చుకొని పోతున్నరాకెట్లు. ఒక రాకెట్‌లో ప్రేయసీ ప్రియుల ప్రణయచేష్టలూ; ఆ ప్రేమకథలోని విఘాతాలూ, అద్భుత ప్రపంచాన్ని చూస్తున్నట్లనిపించింది సూర్యానికి.

పిక్చర్ వదలగానే టాక్సీలో ఎగ్జిబిషన్‌కు వెళ్ళారు రాత్రి పదిగంటల దాకా, దేవలోకంనుండి దిగివచ్చిన గంధర్వుల్లాగా విహరించారు.

"శకుంతలా నన్ను నమ్ము. భూమి మునగాని, పైనకాని ఏశక్తీ మనను విడదీయలేదు. మావాళ్లు వొప్పుకోకపోతే వాళ్ళను ఖాతరుచెయ్యను. వాళ్ళు ఏదో విధంగా అడ్డుపెడతారని నీకు భయమైతే, ఇదుగో ఇది ఫైనలియర్‌కాబట్టి, యీ నాలుగునెలూ కాస్త వోపికపట్టు, పరీక్షలు కాగానే మనం ఎటో వెళ్ళిపోదాం తెలిసిన వాళ్ళెవరూ కనపడకుండా, ఏపంజాబో, కాశ్మీరో ఎటో వెళదాం. బ్రతకలేకపోం. ఈ నాలుగు నెలలుకూడా, గడిచిపోవటానికి నీకు భయమైతే, అపనమ్మకమైతే చెప్పు. యీపరీక్ష కాకపోయినా బ్రతకలేమనీ, సుఖపడలేమనీ, భయం నాకులేదు. వదిలేస్తాను. వెళ్ళిపోదామంటే వెళ్ళిపోదాం. చెప్పు" అన్నాడు సూర్యం.

"అలాంటి సాహసం చెయ్యొద్దు. కన్నుపోయేకాటుక పెట్టుకుంటారా ఎవరైనానూ. నెమ్మదిగా ఆలోచన చెయ్యొచ్చు. ఈలోపున మీవాళ్ళే ఇష్టపడతారేమో "

"అది అసంభవం శకుంతలా. మావాళ్ళు పెట్టుబడిదారీవ్యవస్థ ప్రతినిధులు. వాళ్ళు డబ్బూ, వ్యాపారదృష్టీ వదిలిపెట్టి, ఇంకోలా ఆలోచించలేరు."

"అప్పుడే మనం సాహసం చేయవచ్చును. ఈ నాలుగు నెలలూ ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకుంటూ, ధైర్యంగా ఉత్సాహంగా పరీక్షలకి చదివి కోర్సు పూర్తిచేయండి" అని అభిమానపు చూడ్కులతో హెచ్చరిక చెప్పి శకుంతల ఇంటికి వెళ్ళిపోయింది.

తాతయ్య ఇంకా మేలుకునేవున్నాడు.

"సూరీ, బొంబితో, చంద్రమండలాన్ని చూడలేకపోయినా, సినిమాలోనైనా చూసి సంతోషిస్తాను, ఈడుళ్ళో ఆడుకోండటగదా. పెద్దాడు, కారు ఇస్తానన్నాడు. ఇవాళంతా నీకోసం ఎదురు చూస్తూనేవున్నాను. రేపైనా సినిమాకి తీసికెళ్ళరా" అని ప్రాధేయపడ్డాడు

సూర్యం భోజనం చెయ్యలేదు. పడగ్గదిలోకివెళ్ళి, శరీరమంతా, ఉత్సాహంతో నిండిపోతుండగా విశ్రమించాడు.

* * *




శరభరాజుగారు పది లక్షలకు ముట్టచెబుతానని అన్నారు. ఓ కారూ ఇస్తాడట కట్టబోయే సినిమాహాలూ, పెట్టబోయే ఫాక్టరీగూడా ఎరగాచూపాడు. ఇంట్లోవాళ్ళంతా వ్యూహం పన్నారు. ఎక్కడకూ కదలనివ్వరు, మెదలనివ్వరు అందరూ కలిసి సీతపైన విరుచుక పడుతున్నారు సీతంటే సూర్యానికి చాలా ప్రేమ. చిన్న చెల్లెలూ, పిల్లలందరిలోకీ చిన్నది అనే కాదు అసలు తనకు శకుంతలను పరిచయం చేసింది సీతేకదా! అందుకు. నా క్లాస్‌మేట్ అని తీసుకువచ్చి పరిచయం చేయటమే కాకుండా, తమ ఇద్దరిమధ్యా అంతులేని, తీయని, మమతా మాధుర్యాలు నిండిన స్నేహాన్ని పెంపొందింపజేసింది. పాపం సీత, శకుంతల దురదృష్టాన్నంతా తనకు వివరంగా చెప్పింది చిన్నప్పుడే పెద్దలు ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా పెళ్ళి చేశారుట ఆ తాళి కట్టినవాడు, తిరుగుబోతో, తాగుబోతో, దురదృష్టవంతుడో, శకుంతలను వదిలేసి వెళ్ళిపోయాడు. శకుంతలను కాలేజీలో చేర్చారు కన్నవారు, చదువుకో


నైనా చదువుకుంటుందని. శకుంతల వంటి సుకుమారి యీ ప్రపంచంలో ఎక్కడైనా వున్నదా!

తాతయ్య రోజూ ఉపన్యాసాలు దంచుతూనే వున్నాడు. అమ్మ ప్రతి మాలుతూనే వున్నది. సీతకూడా, శకుంతలను మరచిపొమ్మని, రోజూ సలహాలు ఇస్తూనే వున్నది. అన్నలు హెచ్చరించారు. వదినలు బుజ్జగించారు. అక్కయ్యలొచ్చి పట్టుపట్టారు. చెల్లెళ్ళు ప్రాధేయపడ్డారు. ఎక్కడచూసినా, శరభరాజు, శరభరాజు. రాణి, రాణి, పది లక్షలు, పది లక్షలు, కార్లు, సినిమా హాళ్లు, అని వొకటేరొద. మీ రందరూ ఏమైపోయినా సరే. నేను రాణిని పెళ్ళి చేసుకోను. శకుంతలను చేసుకోకుండా వుండను అన్నాడు. అప్పటినుండే మరీ జాగ్రత్తగా వున్నారు, త్వరగా ముహూర్తం పెట్టించి, శరభరాజుగారిని రమ్మని కబురు చేశారు. ఈ దేశంలో ఎక్కడికి పోయినా, పట్టితెచ్చేట్లుగానే వున్నది పీళ్ళ ప్రయత్నం.

అర్ధరాత్రి. శకుంతల నడుం చుట్టూ చేయిచుట్టి ధైర్యాగా, బొంబాయి, ఆపైన ప్లేన్‌లో అమెరికా. అక్కడ కేప్ ఆఫ్ కెన్నడీ. రాకెట్ సిద్ధంగావుంది.

ఓహ్ 'బై'మని దూసుకపోతున్నది. ఇంతై, ఇంకింతై, సుంతై, మరియు నిసుమంతై, చివరకు భూమి, పెద్ద గుమ్మడిపండులా కనిపిస్తున్నది. నక్షత్ర వీధిలో ఆడుకుందామా, కలసి పాడుకుందామా, అని తాను పాడుతున్నాడు. శకుంతల సిగ్గుల మొగ్గయింది. చిన్నారి చిలకైంది. రాకెట్ ఎంత వేగంగా పోతోందో, ఆ వేగానికి క్షణక్షణానికీ పల్లటీలు కొట్టాలేమో ననుకున్నాడు మొదలు తాను. కాని ఇదేమిటి, కార్లో నుదురుపాడు పోతున్నట్లే వున్నది. రైల్లో విజయవాడ వెళుతున్నట్లూ వున్నది. విమానంలో ఢిల్లీ పోతున్నట్లూ వుంది. అంతే. అసలు యీ భూగోళం, అమితవేగంతో క్షణం క్షణం పరిభ్రమిస్తూ వుంటే మనకు తెలుస్తున్నదా. ఎనభై వేలమైళ్ళ వేగాన్ని మించి పరిభ్రమిస్తూవున్నదట, తనచుట్టూ తాను తిరుగుతూ, సూర్యునిచుట్టూ తిరిగే కార్యక్రమంలో. అంతే. కూచున్నదాకానే భయం, ఓసారి రాకెట్లోకూచున్నామంటే ఇక భయంలేదు. మహాసముద్రాలు, నీటిమడుగుల్లా, మహాపర్వతాలు, చిన్న గుట్టల్లా, కాసేపు కనపడి, అదీమాయమై పోతాయి చివరకు. అటుతరువాత తారాపథం, ఆపైన వియన్మండలం, ఆపైన రోదసీకుహరం. ఆపైన విశ్వాంతరయానం అటుపిమ్మట పరమాద్భుత సృష్టివైచిత్ర్యాలు కనులముందు.

ఏమిటో చంద్రమండలం సమీపించే సరికి, తమ శరీరాలే తమకు ముందు బరువై తరువాత తేలికైనాయి. చంద్రుడిచుట్టూ కమ్ముకునే పల్చటి మేఘపు




పోరలా, శకుంతలా, తన మెడచుట్టూ రెండు చేతులూవేసి, గూట్లోగువ్వలా అంటుకుని పోయింది. పూలచెండులా ఎంత తేలికగావుంది శకుంతల!

అబ్బ! చంద్రమండలంపైన దిగిపోయారు. భూమండలంపైనలాగా, సూర్యకాంతి ఎప్పుడూ తెలుపురంగులో మాత్రమే వుండదక్కడ. అన్నిరంగులూ, వొకదానితరువాత వొకటి, వస్తూపోతూ వుంటాయి. రాత్రిపడినట్లు గుర్తు ఎలాగంటే, చివరిసారి, బూడిద వర్ణపు రంగువచ్చి పోతుంది. అప్పుడంతటా చెట్లమీద దీపాలు పూస్తాయి. అదేమిమాయో, దీపాలంటే లైట్లూ, లాంతర్లూ కావు. చెట్లచివరి ఆకులన్నీ నియాన్ లైట్లలాగా వెలుగుతుంటాయి. హిమాలయాల్లోకూడా అలాంటి చెట్లున్నాయట. కాళిదాసు వర్ణించాట్టకూడా. "మహౌషధీం నక్తమివాత్మభాసః" అని. తెలుగుమేష్టారు వూ తెగపీలిగేవాడు, తానే కాళిదాసైనట్లు, ఆ వర్ణనలు చదివిచెపుతూ. ఆయన చాదస్తుడు. ఇంద్రుడుదయించగానే ఇక్కడ చెట్ల చివరలు నియాన్ లైట్లలా వెలుగుతాయి. ఈ ఇంద్రుడున్నూ మరి, స్వర్గలోకపు ఇంద్రుడూ వొకరవునో కాదో. గుల్‌మార్ తోటలూ, దాల్ సరస్సులూ ఇక్కడి చెరువులముందూ, దొడ్లముందూ బలాదూర్. ఇక్కడి చొప్ప దొడ్లే భూలోక సుందర నందనోద్యానాలని చెప్పాలి.

శకుంతలని ముద్దెట్టుకుంటే, నిజంగా అమృతంతాగినట్లే అనిపించింది. భూలోకులుగాళ్ళు, అధరసుధారసం, అని మిడకటం, బహుశా, చంద్రమండలంలో అట్లా వుంటుందని ఊహించటంవల్లనే కావచ్చును.

భలే తెల్లని వెండి, బంగారు

రెక్కలుగల దేవతలువచ్చారు; హంసలు లాగే చిన్న చిన్న హెలికాప్టర్లపైన. అక్కడ కార్లూ, రిక్షాలూ, బళ్ళూ, లారీలూ, పున్నుల్లేవు. ఈ హంస విమానాలు మాత్రం వున్నాయి.

ఆ దేవదూతలు శకుంతలచెక్కిళ్ళను ప్రేమతో నిమిరి, తన చేతులను ఆదరంగా స్పృశించి, మీరు దివ్యులైనారు. ప్రేమ మహా యజ్ఞంలో, పురోడాశాన్ని పొందబట్టే మీకీదివ్యలోకం లభించింది. అంతా వచ్చేస్తామని చూస్తున్నారుగాని, అదెలాసాధ్యం కొశ్మీరేచూడకుండా వచ్చే వాళ్ళు మీ లోకంలో కోటానుకోట్లులేరూ అన్నారు

అవి ఎటువంటి భవనాలో, ఎంత అందంగావున్నాయో, ఆవేంపూలో - ఎంత మధురంగా వున్నాయో.

శకుంతలకి ఇంకా భయం తగ్గినట్లు లేదు. తనసందటనే తమిడిపోయింది.

* * *

సూర్యానికి మెలకువ వచ్చేసరికి కిటికీలోంచి వెండియెండ తనమీద పడుతున్నది. రాత్రివచ్చినకల గుర్తువొచ్చి వొళ్ళంతా పులకరించింది. తెలి తెలిపోతూ ఉత్సాహంగా మొఖం కడుక్కున్నాడు. ఇల్లంతా పరమోత్సాహంగా, కోలాహలంగావుంది. ఎందుకాఅని ఆశ్చర్య పడ్డాడు. ఇదికూడా కలలోభాగం కాదు కదా అని కలవరపడ్డాడు. కాని కాదు. కళ్ళు నులుముకుని మరీ మరీ చూశాడు.

మధ్యహాల్లో శరభరాజుగారు, తాతయ్యతో, ముచ్చట్లుచెబుతూ, టిఫిన్ పట్టిస్తున్నారు. సూర్యం కాఫీ త్రాగి, మర్యాదగా, తనగదిలోకి తాను వెళ్ళబోతూంటే తాతయ్య, 'నాయనా సూర్యం.' అని పిలిచాడు. శరభరాజుగారు బంగారంపళ్ళన్నీ మెరిసేలా, తనని త్రాగేసేలా, హీ హీ అంటున్నాడు. సూర్యానికి నభోమండలానికీ, తారస్థాయికీ, చంద్రమండలానికి, ఇంకా చెపితే, సూర్యమండలం స్థాయిన కోపం పెరిగిపోయింది.

విసురుగావచ్చాడు తాతయ్య 'కూచో బాబూ' అంటున్నంతలోనే "కూచోటానికి రాలేదు. చెపుతున్నాను వినండి శరభరాజుగారు, మీరు ఎన్నిమార్లు వచ్చినా, ఎంత ప్రయత్నించినా. మీ అమ్మాయిని నేను చేసుకోను. నేను శకుంతలనే అమ్మాయిని ఎంతగానో ప్రేమించాను. నాప్రాణంకన్నా మిన్నగా ప్రేమించాను. గాఢంగా ప్రేమించాను. చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటాను. లేకపోతే అసలు నాకు పెళ్ళే వుండదు. ఈమాటలుచెప్పటం, నాబాధ్యతగా భావించి చెపుతున్నాను. మీరు మాఇంటికి యీనిమిత్తంగా మరెప్పుడూ రావద్దు" అనిచెప్పి గిరుక్కున వెనక్కి తిరిగాడు.

శరభరాజుగారు పెదవులు విగించుకున్నారు.

మేడమెట్లెక్కుతున్న సూర్యానికి, తాతయ్యమాటలు వినిపించాయి,

"ఈకాలపు కుర్రాళ్ళంతేనండీ. ప్రపంచం ఎంత ముందుకుపోతున్నదీ! చంద్రమండలానికి ప్రయాణం కడుతున్నారు, నరులు. వీడు నే చెపితే కాదనడులెండి. చిన్నతనం, తెలీదు." అని ఏమిటేమిటో అవాకులూ చవాకులూ పలుకుతున్నాడు.

వెనక్కుతిరిగి మెట్లమీద నిల్చునే గట్టిగా అరవాలనిపించింది సూర్యానికి. చంద్రమండలానికి పోయినా, సూర్యమండలానికి పోయినా, డబ్బే సర్వస్వమనుకునే పీనుగల బుద్ధిపోదు. ఇంకా వంచనచేయటం, కాంట్రాక్టులుచేయటం, పేదవాణ్ణి మోసగించటం, నోరులేనివాణ్ణి అణగత్రొక్కటం చేస్తూనే వుంటారు. మనిషి నాగరికతలో అడుగుపెట్టినప్పటినుంచీ ధనవంతుడు ధనహీనుణ్ణీ, బలవంతుడు బలహీనుణ్ణీ వంచన చేస్తూనేవున్నాడు. శకుంతలను తానెన్నటికీ వంచించలేదు. ముందున్న చంద్రబింబాన్ని వదిలేసుకుని, వెంగలి మాటలకు మోసపోయే వెర్రివాడు కాదు తాను. చంద్రమండలంలోని సంబంధాన్ని తీసుకవచ్చి, కోటీశ్వరుదెవడైనా తిసకూతురినిస్తానన్నా – తనకొద్దు – వొద్దు. వొద్దూ–

కాని సూర్యం యీ మాటలను బిగ్గరగా అరచి చెప్పలేదు. శరభరాజుగారి రథంలాంటి కారు, ఇంటిగుమ్మం ముందు కదులుతున్నట్లున్నది సూర్యం కుర్చీలో కూలబడి అరచేతిల్లో తలను బంధించుకున్నాడు అయోమయంగా.

